

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సహచరుడు

**సౌగంధి ఆ కాలం** నాటి చాలామంది ఆడపిల్లల్లా చక్కటి సాహిత్యాన్ని చదువుతూ పెరిగింది. తను చదివిన ప్రబంధాలు, కాల్పనిక సాహిత్యం ఆమె ఊహలకి రెక్కలని, ఆలోచనలకి సౌకుమార్యాన్ని అద్దాయి.

సౌగంధికి తన పేరంటే చాలా ఇష్టం. వాళ్ళ నాన్నకి అందులోని సొగసేం కనపడలేదు. పెద్ద కూతురు సౌజన్య పేరుకి రైమింగ్‌గా ఉంటుందని సౌగంధికి ఆ పేరు పెట్టాడు అంతే. కాని ఆ పేరు ఆమెని పదిమందిలో ప్రత్యేకంగా కనబడేలా చేసింది.

ఆమెకి తెలీకుండా మనసంతా సున్నిత భావాలతో నిండిపోయి విరిసిన మల్లెలు నేలరాలినంత మెత్తగా మాట్లాడేది. సౌగంధి కోపాన్ని చూడాలని ఆమె పరుషంగా మాట్లాడే మాటలని వినాలని స్నేహితురాళ్ళు ప్రయత్నించారు కాని ఓడిపోయారు.

ఆమె బి.కాం ఆఖరి సంవత్సరంలో ఉండగా నాయనమ్మ కొడుక్కి చెప్పింది.

"ఈ మాఘమాసంలో సౌకి పెళ్ళి చేసేస్తే నీ భారం తగ్గుతుందిగా పెళ్ళయ్యాక పరీక్షలు రాస్తుందిలే. వైశాఖంలో పెళ్ళంటే, ఆ ఎండల్లో మనవల్లకాదు."

ఆ మాటలు విన్న సౌగంధిలో తొలిసారి పెళ్ళికి సంబంధించిన ఆలోచనలు కలిగాయి.

తనకి పెళ్ళి! ఈ సౌగంధిని అందుకోడానికి ఏ అనిలుడు వస్తాడో! అతని పేరేమై ఉంటుంది?

ఆమె కొన్ని పేర్లు ఆలోచించింది. కాని నచ్చలేదు. చటుక్కున తను చదివిన అనువాద బెంగాలీ సాహిత్యంలోని పేరు గుర్తుకొచ్చింది. హిమాంశు! ఎంత చక్కటి పేరు? చల్లని చందమామలా అతనుంటే తను రజనీగంధకాదా? ఆమె ఆ రాత్రి తనకి కాబోయే సహచరుడికి హిమాంశుగా నామకరణం చేసింది.

డిసెంబర్ నించి పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టిన సౌగంధి తండ్రి జనవరి నాటికి ఓ సంబంధం ఖాయం చేసాడు.

"అబ్బాయి స్టేట్ గవర్నమెంట్‌లో పని చేస్తాడు. పెద్దగా బాధ్యతలు లేవు. చూడడానికి బానే ఉన్నాడు" భోజనాల దగ్గర చెప్పాడు.

"పిల్లకి బొత్తిగా నోట్లో నాలుక లేదు. దానికేమైనా కావాలన్నా మనం చూసి ఇవ్వాల్సిందే తప్ప నోరు విడిచి అడగదు. పిల్లాడు సౌమ్యంగానే ఉన్నాడా?" సౌ తల్లి అడిగింది.

"బానే మాట్లాడాడు మరి. ఆపైన దాని అదృష్టం. ఇ దైనా కొంచెం లౌక్యం నేర్చుకోవాలి. నోరులేని పిల్లంటే చులకన ఈ రోజుల్లో"

ఆయన దేవుడి మీద భారం వేసాడు.

"అబ్బాయి పేరేంటి?"

"శంకర్రావ్."

ఆ మాట విన్న సౌగంధి కొద్దిగా నిరుత్సాహ పడింది.

ఆ రాత్రి ఆమె తన మేనమామ ఇచ్చిన ఆ సంవత్సరం డైరీని బయటకి తీసింది. రామాయణం సైజ్‌లో ఉన్న ఆ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డైరీలో అడ్వర్టైజ్‌మెంట్స్ కాక 1984 లీప్ యియర్ కాబట్టి 366 పేజీలు ఉన్నాయి.

ఆమె ఆరోజు తేదీని పట్టించుకోకుండా జనవరి మొదటి తారీకు పేజీలో గుండ్రటి నీలం అక్షరాల్లో రాసింది.

'హిమాంశూ! నా జీవన సహచరుడా! నీ ప్రాంగణంలో అడుగుపెట్టాలని ఆశతో ఎదురుచూస్తున్నాను" – నీ సౌగంధి.

ఆ మాటలని ఒకటికి రెండుసార్లు చదివింది. తర్వాత ఆ డైరీని భద్రంగా దాచింది.

శంకర్ పెళ్ళి చూపుల్లో అందరికీ నచ్చాడు. మంచివాడు అనిపించాడు చూడగానే. సౌగంధిని ఒక్క ప్రశ్నకూడా అడగలేదు. బుద్ధిగా పెద్దవాళ్ళతోనే మాట్లాడాడు.

సౌగంధి మనఃఫలకం మీద ఏర్పడ్డ తొలి చిత్తరువు శంకర్‌దే కాని, అతనికి ఆమె హిమాంశు అనే పేరు పెట్టింది. అతను పెళ్ళి చూపుల్లో తన వంక ఓసారి చూసి తలతిప్పుకుని పెద్దవాళ్ళతో మాట్లాడడం ఆమెకి నచ్చలేదు. అది తిరస్కరణగా భావించి ఆమె మనసు విలవిల్లాడింది.

ఆ రాత్రి ఆమె డైరీ తీసి, పక్కపేజీలో రాసింది

'సహచరుడా! నువ్వు నన్ను ఓరగా చూసి చిరునవ్వు నవ్వావు. చంద్రకిరణాలకి విచ్చుకున్న కలువలా నా మనసు విరిసి మురిసింది.

'సౌగంధి పేరు చాలా బావుంది కాని నువ్వు సౌదామినిలా ఉన్నావు' అన్నావు. ఈ ప్రశంస నేను ఎదురు చూడని బహుమతి..' ఆమె తన ఊహలకి రంగులు అద్దుతూ ఆ పెళ్ళిచూపులని రసరమ్య కావ్యంలా మార్చింది.

పెళ్ళిలో అంతా జంట బావుంది అని మెచ్చుకున్నారు. పేర్లు చెప్పే ముచ్చట దగ్గర ఎంత ప్రయత్నించినా ఆమెనోటినించి ఆమాట వినలేకపోయారు.

"హిమాంశూ" గొణిగింది కాని ఆ గోలలో ఎవరికీ వినపడలేదు.

'చెప్పేసింది పదండి. గృహప్రవేశానికి టైం మించిపోతుంది ' పెద్దవాళ్ళు హడావిడి పెట్టారు.

తొలి రాత్రి అతన్నించి ప్రశంసలు, కబుర్లు ఆశించింది కాని శంకర్ చాలా  యాంత్రికంగా ప్రవర్తించి తృప్తిగా నిద్రపోయాడు. నిద్రపట్టని సౌగంధి లేచి తన డైరీ తీసుకుని బాల్కనీలోకి వెళ్ళి వీధి దీపం కాంతిలో రాసింది.

నా సుగంధాన్ని నీ ఒంటికి అలుముకుంటానన్నావు. 'నీ సుకుమార దేహం నా చేయి తాకిడికి గాయపడి పూసిన మోదుగుకొమ్మ అవుతుందేమో అన్నావు. చేతుల తాకిడా చేతల తాకిడా?

కొన్ని చోట్ల సున్నితత్వం కంటే మొరటు తనం బావుంటుందేమోనబ్బాయ్... ఆమె ఆ పేజి నిండేదాకా ఊహల్లో విహరిస్తూ రాస్తూనే ఉంది.

కొత్తకాపురంలో శంకర్రావుకి భార్యమీద ఆరోపణలు ఏమీ లేవు. ఆ వయసు పిల్లల్లోని చలాకీతనంలేదు అనుకున్నాడు. వాళ్ళల్లోని గయ్యాళితనం, ఆశ, ఆబ లేనందుకు అతను చాలా సంతోషించాడు. నోరు విడిచి ఏమీ అడగని సౌగంధికి తనే చీరలు కొనేవాడు. ఆ ముదురు రంగులు నచ్చకపోయినా చిరునవ్వుతో తీసుకునే సౌగంధి డైరీలో తనకి ఇష్టమైన లేత రంగుల్లోని మెత్తటి దుస్తులు తెచ్చిన సహచరుడికి కృతజ్ఞతలు చెప్పుకునేది. తను ఒకరకమైన ఉన్మాదంలోకి వెళ్తోందని ఆమె గుర్తించలేకపోయింది.

రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు కాబట్టి వారి వైవాహిక జీవితంలో వివాదాలు లేవు. నిర్ణయాలన్నీ శంకర్ తీసుకుంటే, సౌగంధి వాటిని చక్కగా అమలు చేసేది. అతను కొనే బంగారుముద్ద జరీ చీరలు కట్టుకుని, మొరటు నగలు ధరించేది. ఊహల్లో తను ఇదికాదు కాబట్టి ఆమె ఎప్పుడూ ఇబ్బంది పడలేదు.

భర్తనించి తనుకోరుకునే ప్రశంస రాసుకునేది.

హిమాంశూ నీదెంత చల్లటి చూపైనా చురుకైన చూపుకూడా సుమా! నేను లేత గులాబీ రేకలు పరిచినట్లున్న తెల్ల చీర కట్టుకున్నానని చూడకుండానే ఎలా గ్రహించావబ్బాయ్? నన్ను అల్లుకుపోయావే? మంచు కురిసిన గులాబీలా

ఉన్నావన్నావే? నీకు కవిత్వం ఎక్కువైపోయింది. తుమ్మెదలా నా చుట్టూ తిరుగుతూ, సుగంధాలీనడం నీదే తప్పు అంటావా? అబ్బా గడుసుతనం ఎక్కువవుతోంది.

నిజానికి ఆ రోజు ఆమె ప్రత్యేకంగా తయారైనా శంకర్ ఆ విషయం గుర్తించలేదు. అతను మంచివాడే కాని భావుకత తక్కువ. పైగా చాలామంది మగాళ్ళలా పెళ్ళాలని పొగడం ఏమిటి?' అనే దృక్పథం కూడా అతనిలో ఉంది.

తమ పిల్లల్ని సౌగంధి చక్కగా పెంచి పెద్ద చేసింది. వాళ్ళు ఆ డైరీలోకి ఎక్కలేదు. ఎందుకంటే ఆమె మనసు పంతొమ్మిదో ఏడులోనే ఆగిపోయింది. తామిద్దరి మధ్య పిల్లలకి కూడా స్థానం లేదు.

శంకర్రావు ఉదయం నించి తన ఫైల్ కోసం వెదుకుతున్నాడు. వచ్చేనెలలో రిటైర్మెంట్. ఆఫీస్‌కి సబ్మిట్ చెయ్యాల్సిన కొన్ని డాక్యుమెంట్స్ కనిపించడంలేదు. సౌగంధి ఇల్లంతా శుభ్రంగా సర్దుతుందికాని అతని కాగితాల జోలికి వెళ్ళదు. కాబట్టి భార్యనేం అనలేక అతనే వెతుక్కుంటున్నాడు.

మొత్తానికి బెడ్‌రూంలోని కబోర్డ్‌లో అతనికి కావల్సిన ఫైల్ దొరికింది. నిశ్చింతగా ఊపిరి పీల్చి తను చిందరవందర చేసినవన్నీ మళ్ళీ లోపల సర్దసాగాడు.

అకస్మాత్తుగా అతని దృష్టి సౌగంధి డైరీమీద పడింది. దాన్ని చేతిలోకి తీసుకుని చూసాడు. 1984నాటి డైరీ అది. తెరిచి చూసాడు. మూడువందల పేజీలకి పైనే నిండి ఉన్నాయి. 'కథలు కూడా రాస్తుందా ఈ అయోమయం' అనుకున్నాడు. అతనికి నవ్వుకూడా వచ్చింది.

ఓ పేజీ తిప్పి చదివాడు. కోపంతో అతని కళ్ళు చిన్నవయ్యాయి. 'సహచరుడా! నామీద అంత తమకం ఏమిటి? రతీమన్మథుల్లా నిత్య యవ్వనంతో మనం స్వర్గాల అంచులు తాకాలి. సౌ అని నువ్వు నా చెవిలో గుసగుసలాడుతున్నప్పుడు కొంటె కుర్రాడా! చేతులూరుకోవా?

శంకర్ గబగబ కొన్ని ముందు, వెనక పేజీలు చదివాడు. అందులోని భాష, పదాలు అతనికి అర్థంకాకపోయినా భార్యకి హిమాంశు అనే ప్రియుడు ఉన్నాడని మాత్రం అర్థమైంది.

నిశ్శబ్దంగా ఆ డైరీని యథాస్థానంలో పెట్టి బయటకి వచ్చాడు.

'సౌ! ఓ కప్పు కాఫీ ఇస్తావా?" అడిగాడు.

ఐదు నిమిషాల తర్వాత సౌగంధి కాఫీ కప్పుతో వచ్చింది.

ఆమెవంక తదేకంగా చూసాడు.

వయసు ఆమె మీద ఎక్కువ ప్రభావం చూపించలేదు. ఏభై ఎనిమిదేళ్ళ సౌగంధి నలభైల్లో ఉన్నట్లుగా ఉంది. ఆమె కళ్ళూ, చర్మం మెరుస్తున్నాయి. ఆ కళ్ళల్లో అదే అమాయకత్వం, అదే నైర్మల్యం.

అతనికి ఆమెని ఏం అడగాలో అర్థంకాలేదు.

'ఇది చాలా మంచిది. వాడే దొంగ వెధవ. మాయమాటలు చెప్పి దీన్ని లోబరుచుకున్నాడు' అనుకున్నాడు.

ఆరోజంతా ఆలోచించి మామగారికి ఫోన్ చేసి తక్షణం రమ్మని చెప్పాడు.

అకస్మాత్తుగా వచ్చిన తల్లితండ్రులని చూసి సౌగంధి సంతోషించింది.

"'పెద్దవాళ్ళమైపోయాం. ప్రయాణాలు చేయలేం- అని మా ఇంటికి రావడం మానేసారు నాన్న. ఇంతకాలానికి రావాలి అనిపించిందా?" అభిమానంగా అడిగింది.

"అదేంటి? అల్లుడు అర్జెంట్‌గా రమ్మని ఫోన్ చేస్తే యువీకి పెళ్ళి కుదిరిందేమో అనుకున్నాం" వాళ్ళు ఆశ్చర్యపోయారు.

ఆ మధ్యాహ్నం పిల్లలు కాలేజ్‌కి వెళ్ళాక శంకర్రావు అత్తామామలతో సమావేశమయ్యాడు.

"ఇలా మాట్లాడడం నాకు అసహ్యంగా ఉంది కాని, సౌ కి ఒక ప్రియుడున్నాడు" చెప్పాడు.

వాళ్ళు అతనివంక అర్ధంకానట్లుగా చూసారు.

"అవునండీ. అతని గురించి డైరీలో రాసుకుంది. నేనే అడుగుదామనుకున్నాను కాని ఏమడగాలో అర్ధం కావట్లేదు. అందుకే మిమ్మల్ని రమ్మన్నాను" ఇబ్బందిగా చెప్పాడు.

"బాబూ! అది పిచ్చిది. ఎప్పుడూ ఊహల్లోనే విహరిస్తూంటూంది. ఏవో కథలు రాసుకుందేమో?" అత్తగారు చెప్పింది.

"కథలు కాదండి. నిజాలే రాసింది."

"నువ్వు ఆఫీస్‌కి వెళ్ళినప్పుడు వాడొస్తాడా? లేక ఇదే వెళ్తుందా?" మామగారు కోపంగా అడిగారు.

"ఏం మాటలవి?" భార్య వారించింది.

"సౌ అసలు బయటకి వెళ్లదండీ. కూరగాయలతో సహా అన్నీ నేనూ, పిల్లలే చూసుకుంటాం. ఇంటికి ఎవరూ రావడం కూడా నాకు తెలీదు. ఇంకేదో అయ్యింది. పెళ్ళీడు పిల్లలున్నారు. ఇంక ఈ సంబంధాలు మానేయమనండి" శంకర్రావు చెప్పాడు.

అల్లుడు సంస్కారానికి వాళ్ళ మనసులో అతనికి నమస్కరించుకున్నారు.

"సౌ" తల్లి పిలిచింది.

వంటగదిలో పని చేసుకుంటున్న సౌగంధి ఆ పిలుపుకి ముందు గదిలోకి వచ్చింది.

"హిమాంశు ఎవరు?" శంకర్రావు అడిగాడు.

ఆమె నిర్ఘాంతపోయింది.

"అదేం ప్రశ్నా?" నవ్వుతూ అడిగింది.

"సిగ్గులేకుండా నవ్వు కూడానా?" తండ్రి అరిచాడు.

ఆమె నివ్వెరబోతూ ఆయన వంక చూసి నెమ్మదిగా అడిగింది.

"సిగ్గులేకపోవడం ఏమిటినాన్నా? నేను సౌగంధి ఎవరు? అని అడిగితే నువ్వు నవ్వవూ"

"నేను అడిగింది శంకర్రావు ఎవరని కాదు. హిమాంశు ఎవరని?" శంకర్ కఠినంగా చెప్పాడు.

ఆ కాఠిన్యానికి ఆమె మనసు గాయపడింది.

"ఎవరూ లేరని చెప్పవే" తల్లి దుఃఖంగా సలహా ఇచ్చింది.

"లేకపోవడం ఏమిటమ్మా? ఉన్నాడుగా? నా సహచరుడు" శంకర్రావుని చూస్తూ చెప్పింది.

"విన్నారుగా. నేనేం చేయాలో చెప్పండి" శంకర్రావు మామగారితో కోపంగా చెప్పాడు.

"వాడు చచ్చిపోయాడా?" తల్లి కూతురికి హింట్ ఇస్తున్నట్లుగా అడిగింది.

సౌగంధి చెవులు మూసుకుని విలవిల్లాడుతూ అన్నది.

"ఏం మాట్లాడుతున్నావమ్మా? ఆయన లక్షణంగా ఉంటే."

ఆవిడ తలపట్టుకుంది.

"వాడు నిన్ను ఎక్కడ కలుస్తాడు?" తండ్రి అడిగాడు.

"కలవడం ఏమిటి?" సౌగంధి అయోమయంగా అడిగింది.

శంకర్రావు వేగంగా వెళ్ళి ఆమె డైరీని తెచ్చి విసిరికొట్టి అడిగాడు. "మరి ఈ రాసలీలన్నీ ఎక్కడ జరిగాయి?"

ఆమె సిగ్గుగా నవ్వి చెప్పింది.

"మన పడకగదిలోనేగా?"

"ఎంత ధైర్యమేనీకు?" తండ్రి రౌద్రంగా అరిచాడు.

"ధైర్యమేమిటి నాన్నా? మీరేగా పెళ్ళిచేసారు?" సౌగంధికి ఏం జరుగుతోందో అర్థంకావడంలేదు. నలభై ఏళ్ళుగా ఆమె మనసులో గుడి కట్టుకుని ప్రతిష్టించిన హిమాంశు భౌతికంగా శంకర్రావే అవడంతో ఆమె ఆ ఇద్దరి మధ్య ఎవరు వాస్తవం, ఎవరు కల్పితం అనే విచక్షణని కోల్పోయింది. దాంతో బాహ్య ప్రపంచంలో ఆమె అర్థం కాని ప్రశ్నయింది.

"ఇకనైనా ఆ హిమాంశుగాడిని వదిలెయ్‌వే. ఈ సంగతి తెలిస్తే నీ కూతురికి పెళ్ళి సంబంధాలు వస్తాయా చెప్పు" తల్లి అనునయంగా కోరింది.

"అమ్మా! నువ్వు చెప్పాల్సిన మాటేనా ఇది. నీ అల్లుడ్ని వదిలేసి నేను బతకగలనా?" సౌగంధి జాలిగా అడిగింది.

"అల్లుడా?" శంకర్రావు పట్టలేని ఆగ్రహంతో ఆ డైరీని అందుకుని బాల్కనీలోంచి కిందికి విసిరేసాడు.

కెవ్వున అరుస్తూ సౌగంధి కూడా దానివెంటే కిందికి దూకింది.

తల నేలకి తాకి రెండుగా విచ్చుకున్నా, ఆమె చెయ్యిమాత్రం ఆ డైరీని భద్రంగా పట్టుకుంది రక్తపుధారలో తడుపుతూ.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments